క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 25న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు. భీమ్మనగర్, శ్రీనివాస్ కాలనీ, బాలసముద్రం, ఎల్ఐసీ కార్యాలయం, బాలసముద్రం ప్రాంతంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

చీరల పంపిణీ



వరంగల్ : రంజాన్ మాసం సందర్భంగా వరంగల్ ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఎంఎస్ పాషా ఆధ్వర్యంలో 300 మంది ముస్లిం మహిళలకు చీరలు, దుస్తులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ రంజాన్ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్‌కు ఏర్పాట్లు



ఖిలా వరంగల్ : ఈద్గా మైదానంలో రంజాన్ పండుగ ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌కు భారీ ఏర్పాట్లు చేస్తామని తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ తెలిపారు. 31న జరుగనున్న రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఈద్గా మైదానంలో ప్రారంభమైన ఏర్పాట్లను ముస్లింలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈద్గా మైదానంలో మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చెత్తచెదారం తొలగింపు, ప్రహరీకి రంగులు వేయటం పనులు జరుగుతున్నాయని తెలిపారు. చాంద్‌పాషా, దస్తగిరి, మహబూబ్, సాధిక్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత

మడికొండ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మడికొండకు చెందిన పేద ముస్లిం కుటుంబానికి నిత్యావసర సరుకులను హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఒక బీద కుటుంబానికి సహాయం చేస్తుండాలని పిలుపునిచ్చారు.

ముచ్చర్లలో ఇఫ్తార్ విందు



హసన్‌పర్తి : మండలంలోని ముచ్చర్లలో సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానికులు రియాజుద్దీన్, సిరాజుద్దీన్, జమీల్, యూసఫ్, చిర్ర రాజేష్, సుమన్, శ్రవణ్, సతీష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్వీ నాయకుల ఫిర్యాదు

కేయూ క్యాంపస్ : మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో కేయూ బీఆర్ఎస్వీ నాయులు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, బాధ్యులు జెట్టి రాజేందర్, కత్తెరపల్లి దామోదర్ ధితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో వివిధ డిగ్రీ కాలేజీల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో స్వచ్ఛతా సేవా నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్తచెదారం తొలగిస్తూ, ప్లాస్టిక్‌ను తొలగించారు. అనంతరం ఆస్పత్రి నుంచి కేడీసీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సైదానాయక్, కోఆర్డినేటర్ ఈసం నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కళల జాతర

హన్మకొండ కల్చరల్ : జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల కళల జాతర-2025 ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి హనుమకొండలోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో సొసైటీ నిర్వాహకులు జడల శివ, హరిత దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సామాజిక సేవకురాలు, అనితారెడ్డి, విద్యావేత్త ఝాన్సీ, బహుజన సాహిత్య వేదిక జాతీయ మహిళా అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి ముఖ్యఅతిథులుగా పాల్గొని కళల జాతరను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన బాలబాలికలకు ఉగాది పురస్కారాలు అందజేశారు.కార్యక్రమంలో డాక్టర్ రుక్మిణి, రోజారాణి, డాక్టర్ బలిజపల్లి నగరత్నం, మాలిపెద్ది కృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

వాల్వ్‌లతో తరచూ సమస్యలు
- రంజాన్ దీక్షలకు నీటి ఇబ్బందులు
- 13వ డివిజన్‌లో నిలిచిన సరఫరా

వరంగల్ : పవిత్ర రంజాన్ మాసంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది.. అధికారుల ఆదేశాలు వరంగల్ ఎల్‌బీనగర్‌లో అమలు కావడం లేదని తెలుస్తోంది. వరంగల్ మున్సిపల్ అధికారులు దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లో తలెత్తున్న సమస్యలను పట్టించుకోక పోవడమే ప్రధాన కారణం. ఈ ఫిల్టర్ బెడ్‌పై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో తరుచుగా సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. 20 రోజుల క్రితం ఫిల్టర్ బెడ్‌లోని ఒక ఇన్‌పుట్ వాల్వ్ మరమ్మతుకు రావడంతో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో 13వ డివిజన్‌లోని ఎల్‌బీనగర్, ఎంహెచ్‌నగర్, వీవర్స్ కాలనీలకు నీటి సరఫరా నిలచిపోయింది. 15 రోజులుగా అధికారులు పట్టించుకోక పోవడంతో రంజాన్ పండుగ దీక్షలు రావడంతో స్థానికులు, డివిజన్ నాయకులు మున్సిపల్ సిబ్బందికి తెలియజేశారు. వెంటనే అధికారులు ఈ వాల్వ్‌ను రిపేర్ చేయించి మళ్లీ బిగించారు. రెండ్రోజుల పాటు నీటి సరఫరా జరుగుతున్న క్రమంలో అదే పైపు లైన్‌కు చెందిన ఔట్‌పుట్ వాల్వ్ మూడ్రోజుల క్రితం రిపేర్‌కు వచ్చింది. దీంతో మళ్లీ నీటిఎద్దడి సమస్య మొదటికొచ్చింది. పలు కాలనీలకు నీటిసరఫరా నిలిచిపోవడం, దీక్షలో ఉన్న వారితో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యను పట్టించుకునే వారు లేరని వాపోయారు. ప్రస్తుతం వేసవికాలం రావడంతో పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతులు చేయించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని, కిందిస్థాయి ఉద్యోగులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా వాల్వ్‌లకు రిపేర్లు వెంటనే చేయించాల్సి ఉన్నప్పటికీ రోజుల తరబడి సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆయా డివిజన్లకు చెందిన ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేయర్, కమిషనర్లు ప్రతి రోజు నీటి సరఫరాపై దృష్టి పెట్టాలని ప్రకటించడం తప్పా క్షేత్ర స్థాయిలో జరిగే అలసత్వంపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మరమ్మతులు చేయించి ప్రజలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



దేశాయిపేటలోని ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్

చుక్క నీరు లేదు..



నాలుగు రోజులుగా మా కాలనీకి చుక్క నీరు రాలేదు. అన్నం వండుకునేందుకు కూడా ఇబ్బంది పడుతున్నాం. బయటి నుంచి క్యాన్లతో నీళ్ల తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి వెంటనే నీరు సరఫరా చేయాలి.

- ఉప్పమ్మ, ఎంహెచ్‌నగర్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య.. అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దొడ్డు రకం ధాన్యంతోపాటు సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేశామని, పేర్కొన్నారు. ఈనెల 29 నాటికి అన్ని మండలాల్లో తప్పనిసరిగా పంటల నమోదు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్, డీఆర్‌డీఓ మేన శ్రీను, పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, ఎల్‌డీఎం శ్రీనివాస్, మార్కెటింగ్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పీజీహెచ్ఎంపై చర్య తీసుకోవాలి



ధర్నాలో మాట్లాడుతున్న టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, పాల్గొన్న బాధ్యులు

- టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి
- ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ధర్నా

విద్యారణ్యపురి : హనుమకొండ జిల్లాలోని కమలాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీజీహెచ్ఎంగా పనిచేస్తున్న రాజమల్లయ్యపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. అవకతవకలకు పాల్పడ్డ రాజమల్లయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ టీటీయూ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ శిబిరంలో మణిపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఒకరికి పదో తరగతి ఒరిజినల్ మెమో ఉండగానే మరొకరికి డూప్లికేట్ మెమో జారీ చేసేలా పీజీహెచ్ఎం సహకరించారని, పలువురి ఉపాధ్యాయులపై వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. రాజమల్లయ్యపై జయశంకర్ భూపాలపల్లి డీఈఓ విచారణ చేపట్టి పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీకి నివేదిక సమర్పించినా అతడిని సస్పెండ్ చేయకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బాధితులకు తమ సంఘం అండగా ఉంటుందన్నారు. అనంతరం టీటీయూ బాధ్యులు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడి కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేశారు. టీటీయూ బాధ్యులు భిక్షపతి, నరసింహస్వామి, మూలకృష్ణ మూర్తి, రవి, నరేందర్, శ్రీనివాస్, రమేష్, మహిపాల్‌రెడ్డి, సుధాకర్, రమేష్, విజేందర్ రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

కేడీసీలో అధ్యాపకుల నిరసన

విద్యారణ్యపురి : పాతపెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని, యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజీ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్‌యూసీటీఓ) పిలుపు మేరకు అధ్యాపకుల తమ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐఎఫ్‌యూసీటీఓ జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఎ.సంజీవయ్య మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలన్నారు. ఎంఫిల్, పీహెచ్‌డీ కలిగిన అధ్యాపకులకు అదనపు ఇంక్రిమెంటు ఇవ్వాలన్నారు.అధ్యాపకుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ ప్రవీణ్, సొసైటీ ఫర్ చేంజ్ ఇన్ ఎడ్యుకేషన్ జనరల్ సెక్రటరీ ఎడమ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ వాసం శ్రీనివాస్, వెంకన్న, వినోద్‌రావు, కవిత, ఇందిర, సమత, కోమల, శ్రీనివాస్, ప్రసూన, సుమతి, సంధ్య,యాకూబ్, కిరణ్, మహేందర్, వేణుగోపాల్, అనిల్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

ప్రయాణికులకు అవగాహన



కాజీపేట రూరల్ : ప్రపంచ క్షయ (టీబీ) దినోత్సవాన్ని పురస్కరించుకోని రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్‌లో సోమవారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ డి.రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్‌లో, జంక్షన్ బయట ర్యాలీ చేపట్టి ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ రవీందర్, సజ్జన్‌లాల్, రాజేష్, టీటీలు, సిబ్బంది ప్రయాణికులు పాల్గొన్నారు.

ఉప ఎన్నిక నిర్వహించాలి

కాజీపేట : గ్రేటర్ మున్సిపల్ పరిధిలోని 61వ డివిజన్‌లో ఉప ఎన్నిక నిర్వహించాలని కోరుతూ అదనపు కలెక్టర్ వెంకటరెడ్డికి కాలనీవాసులు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక కార్పొరేటర్ ఎలకంటి రాములు అనారోగ్యంతో మృతి చెందడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నట్లుగా విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, అశోక్ పాల్గొన్నారు.

ఏఐతో దూసుకెళ్తున్నాం

- ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి : నేటి ప్రపంచం కృత్రిమ మేధస్సుతో (ఏఐ) అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తోందని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి సూచించారు. మండలంలోని అన్నాసాగరం శివారులో గల సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'నాస్ కం డిజిటల్ 101 ప్రోగ్రాం, ఐబీఎం స్కిల్ బిల్ట్-మేథస్సు' అనే అంశంపై రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి డాక్టర్ రాజశ్రీరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థినులు నూతన ప్రాజెక్టులు రూపొందించాలని సూచించారు. డాక్టర్ శ్రీకాంత్, మహేందర్‌రెడ్డి, సుదర్శన్, శ్రీవాణి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీపాల్‌రెడ్డికి ఘన సన్మానం

హసన్‌పర్తి : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఇటీవల ఘన విజయం సాధించిన పింగిళి శ్రీపాల్‌రెడ్డిని డైట్ కళాశాల 1992-93 బ్యాచ్ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సోమవారం ఎర్రగట్టుగుట్టలోని మిత్ర ఫంక్షన్ హాల్‌లో డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీపాల్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. నా విజయంలో భాగస్వాములైన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం శ్రీపాల్‌రెడ్డిని మెమొంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ డి.రమేష్, బిల్లా సుధీర్‌రెడ్డి, శ్రీనాథ్, డాక్టర్ సదయ్య, ఎ.మల్లయ్య, సౌభాగ్యలక్ష్మి, కృష్ణవేణి, సరళ, శ్రీధర్, వసుంధర, భానుప్రసాద్‌రెడ్డి, చల్లా రాజిరెడ్డి, గోలి నవీన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, కోలా శంకర్, అలివేలు మంగ, శ్రీనివాస్, సరిత, లక్ష్మారెడ్డి, డాక్టర్ లక్ష్మణ్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న మిత్రులు

క్రీడాకారుడికి సన్మానం

నయీంనగర్ : గోవాలో జరిగిన నేషనల్ బాడ్మింటన్ పోటీల్లో జార్ఖండ్ జట్టుపై గెలిచి పతకం సాధించిన క్రీడాకారుడు, ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తిని సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్‌లు శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

వరంగల్ : సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశ కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేయడాన్ని ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి తీవ్రంగా ఖండించారు. సోమవారం హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశలను అదుపులోకి తీసుకుని ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో మాధవితో పాటుగా జిల్లా ఉష, సుజాత, సుమ, మంజుల, స్వరూప, సునిత, కోమల, శ్రీవాణి, ప్రమీల, పూలమ్మ ఉన్నారు.

అక్రిడిటేషన్ల గడువు పెంపు

వరంగల్ : జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు పెంచుతూ సోమవారం రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అక్రిడిటేషన్ల గడువు ఈనెల 31వ తేదీతో ముగుస్తుంది. కాగా మూడు నెలల పాటు జూన్ 30వ తేదీ వరకు గడువు పెంచుతూ జీఓ జారీఅయ్యింది.

ఓల్డ్ ఫర్నిచర్ షాపులో అగ్ని ప్రమాదం

ఖిలా వరంగల్ : సాకరాశికుంట కట్ట వైపు ఉన్న మార్గంలోని ఓల్డ్ ఫర్నిచర్ షాపులో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారి మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన వర్కర్లు విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను ఆర్పివేశారు. వర్కర్లు స్పందించడం వల్ల పెను ప్రమాదం తప్పిందని స్థానికులు వాపోయారు. ఈవిషయం తెలిసి మిల్స్‌కాలనీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

వరంగల్ : ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు ఈ నెల 31 లోపు మంజూరు చేయాలని పూర్వ రాష్ట్ర కార్యదర్శి కదారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ వరంగల్ జిల్లా శాఖ విస్తృతస్థాయి సమావేశం సోమవారం రంగశాయిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగింది.

అభినందన

కేయూ క్యాంపస్ : ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు పి.సాయికిరణ్, సంధ్యారాణి ప్రతిష్టాత్మక మ్యాథమెటిక్స్ ట్రెయినింగ్ అండ్ టాలెంట్ సెర్చ్ ప్రోగ్రాంకు ఎంపికై మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శిక్షణ పొందారు. కాగా వీరిని సోమవారం ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి అభినందించారు. గణిత విభాగం ఇన్‌చార్జ్ అధిపతి డాక్టర్ టి.నాగయ్య, అంజన్‌రావు, రహమాన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

ఖిలా వరంగల్ : అగ్నికి ఆహుతైన గొర్రెల ఫామ్‌ను సోమవారం యాదవ సంఘం జిల్లా ప్రతినిధులు గిరబోయిన రాజన్న, మాజీ కార్పొరేటర్ దామోదర్ యాదవ్, గడల రమేశ్ సందర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఆర్థికసాయం అందజేయాలని వారు కోరారు.

రైల్వే స్టేషన్‌లో వ్యక్తి మృతదేహం లభ్యం

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వేస్టేషన్‌లోని జనరల్ విశ్రాంతి గది వద్ద సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైందని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు. 50నుంచి 55 ఏళ్ల ఉంటాయని, 5'2 ఎత్తు, గడ్డం మీసాలు, తల వెంట్రుకలు కలిగి ఉన్నాడు. వివరాలు తెలియక పోవడంతో మృతదేహన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతదేహన్ని ఎవరైన గుర్తిస్తే జీఆర్పీ పోలీసులు 94415 57232, 87126 58585 నంబర్లలో సమాచారం ఇవ్వాలని రాజు కోరారు.

వేణుగోపాలస్వామికి గరుడవాహన సేవ

రామన్నపేట : మట్టెవాడలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం రెండో రోజు వైభవంగా నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, ఆలయ అర్చకులు, బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన ఆర్టీసీ కార్మికులు

హన్మకొండ : ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన బహిరంగ సభలో ఆర్టీసీ వరంగల్ రీజియన్‌కు చెందిన కార్మికులు పాల్గొన్నారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాంచందర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు ఢిల్లీకి తరలివెళ్లారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు.

విద్యార్థులు లైబ్రరీని వినియోగించుకోవాలి

హన్మకొండ అర్బన్ : విద్యార్థులు లైబ్రరీని వినియోగించుకోవాలని కేయూ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ హెడ్, బీఓఎస్ చైర్ పర్సన్ డాక్టర్ రాధికారాణి అన్నారు. సోమవారం నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో 'ది రోల్ ఆఫ్ ఈ-సోర్సెస్ ఇన్ అకాడమిక్ లైబ్రరీస్ విత్ స్పెషల్ రెఫరెన్సెస్ టు ఓఎన్ఓఎస్'అనే అంశంపై ఓరియంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాధికారాణి మాట్లాడుతూ లైబ్రరీలో ఈ-పుస్తకాలు, జర్నల్స్, పేపర్లు విద్యార్థుల చదువు, అధ్యయనాలు, పరిశోధనలకు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ సురేష్‌బాబు, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎం.అరుణ, అధ్యాపకులు సారంగపాణి, మధు, సుజాత, సామ్యూల్, ప్రవీణ్‌కుమార్, సమత, సుమలత, శ్రీదేవి, ప్రశాంతి, సునిత, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- వరంగల్ కలెక్టర్ సత్యశారద
- గ్రీవెన్స్‌లో 85 అర్జీల స్వీకరణ

వరంగల్: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలతో కలిసి వినతులు స్వీకరించారు. మొత్తం 85 దరఖాస్తులు రాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. రెవెన్యూశాఖకు 20, కలెక్టరేట్ పరిపాలన విభాగానికి 14, 51 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యశారద

ప్రభుత్వ భూమిని కాపాడాలి



దేశాయిపేటలోని సర్వేనంబర్ 308లోని ప్రభుత్వ భూమిని స్థానికులు జన్ను జయమ్మ, శార (చుక్క), చార్లెస్, ఆరోహన్‌లు వారి పలుకుబడితో తోళ్ల ఖార్ఖానాల ఇంటినంబర్‌తో రిజిస్ట్రేషన్‌లు చేసి బిల్డర్లకు అమ్ముకున్నారు. అధికారులు సర్వే చేయించి ప్రభుత్వ భూమిని కాపాడి భవిష్యత్‌లో ప్రజల అవసరాలకు కేటాయించాలి.

- పోలేపాక రాణి, దేశాయిపేట

మిల్లు స్థలంలోనే ప్లాట్లు కేటాయించాలి..



అజం జహి మిల్లు కార్మికులకు మిల్లుకు చెందిన భూమిలోనే ప్లాట్లు కేటాయించాలని సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలి. మాసిటీలో ఇస్తామని అధికారులు అంటున్నారు. అలా కాకుండా మిల్లు స్థలంలోనే 318 మందికి 200 గజాల చొప్పున ఇవ్వాలి.

- గుత్తికొండ రవి, కాశిబుగ్గ

వినతులు త్వరగా పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి
- 120 అర్జీల స్వీకరణ

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన వినతుల్ని ఆయా శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి స్వీకరించిన వినతులపై అధికారులు అలసత్వంగా వ్యవహరించవద్దని, వాటికి సత్వరమే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 120 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. డీఆర్ఓ వైవీ.గణేశ్, డీఆర్డీఓ మేన శ్రీను, ఆర్డీఓ, నారాయణ, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

వితంతు పెన్షన్ కోసం..



నాభర్త చనిపోయాడు. చాలా రోజులుగా వితంతు పింఛన్ కోసం చూస్తున్నాం. గతంలో స్థానికంగా అధికారులకు వినతులు ఇచ్చాం. ఈసారి కలెక్టర్‌కు ఇద్దామని వచ్చాం. నాకు పాప ఉంది. ఇతర జీవనాధారం లేదు.

- కన్నెబోయిన సరిత, వంగపహాడ్

దివ్యాంగురాలి బాధ్యత మాదే



నా కూతురు అల్లుడు చనిపోయారు. వారి కూతురు మానసిక దివ్యాంగురాలు. అలాంటి పిల్లతో అద్దె ఇంట్లో ఉండలేకపోతున్నాం. మాకున్న ఇంటి స్థలం రోడ్డు విస్తరణలో పోయింది. అయితే ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేస్తే అందులో మా పేరు లేదు. అధికారులు మాకు ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూడాలి.

- గాజుల సరోజన, సమ్మయ్య, శాయంపేట

ప్లాట్ రెగ్యులరైజ్ కోసం ఫీజు కట్టాం



గతంలో ప్రభుత్వం నోటరీ ప్లాట్లు రెగ్యులరైజ్ చేస్తామని చెప్పడంతో మీసేవ కేంద్రంలో రూ.1,000 కట్టాం. తర్వాత ఆవిషయంలో ప్రభుత్వం నుంచి, అధికారుల నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. అధికారులు ప్లాట్ రెగ్యులరైజ్ చేస్తే మిగతా డబ్బులు చెల్లిస్తాం.

- ఆకుగల సుగుణ, మారుతీనగర్, వడ్డేపల్లి

చిరు వ్యాపారం చేస్తా



మాది హనుమకొండ కుమార్‌పల్లి ప్రాంతం. నేను ప్రభుత్వం నుంచి రుణ సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశా. ఇప్పటి వరకు రాలేదు. ప్రభుత్వంపై నమ్మకంతో నాకు రుణ సాయం చేస్తే చిన్న పాటి వ్యాపారం చేసుకుంటా.

- బానోత్ రవి, కుమార్‌పల్లి

మెట్టుగుట్ట పూజారి, ఈఓపై చర్య తీసుకోవాలి



నయీంనగర్ : మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రాగిచెడు అభిలాష్, ఈఓ శేషు భారతిపై శాఖాపరమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో భూపాల్ మాట్లాడారు. భక్తులు సమర్పించే నగదు, బంగారు, వెండి ఆభరణాలకు ఆలయ ప్రధాన అర్చకుడు అభిలాష్ ఎటువంటి రశీదులు ఇవ్వకుండా నేరుగా తన అకౌంట్‌లో జమ చేసుకుంటూ మోసం చేస్తున్నాడు. ఇదే విషయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ డీసీ శ్రీకాంత్ రావుకు ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం అవకతవకలు జరిగాయని ఉన్నతాధికారులకు నివేదిక పంపించారని తెలిపారు.చీకటి రాజు, సుజాత, నాగరాజు గౌడ్, సంతోష్, అశోక్, రాజు, హనుమంతు శర్మ, రామ్ గోవింద్ పాల్గొన్నారు.